ప్రజాశక్తి
శనివారం 19 ఆగస్టు 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

నేడు పంచాయతీ ఉప ఎన్నికలు

ఓట్ల లెక్కింపు, వెంటనే ఫలితాల వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల అకాల మరణం, రాజీనామాల కారణంగా చేపట్టిన ఉప ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు పంచాయతీలకు, వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు 6న నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. 11న నామినేషన్ల స్క్రూటినీ జరిగింది. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీదారుల తుది జాబితాను ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. ఏదైనా కారణాల వల్ల పోలింగ్ నిలిచిపోతే 20వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రీపోలింగ్ నిర్వహిస్తారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో ఒక సర్పంచ్, 9 మంది వార్డులు ఏకగ్రీవం

ఎన్టీఆర్ జిల్లాలో 3 గ్రామ పంచాయతీలు, 12 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో జగ్గయ్యపేట మండలం మల్కాపురం సర్పంచ్‌గా అంబోజి పుల్లారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే చందర్లపాడు మండలం పొక్కునూరు 5వ వార్డుకు జెట్టి నాగలక్ష్మి, జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి 4వ వార్డుకు కందిబండ వలంత, కంచికచర్ల మండలం కొత్తపేట 7వ వార్డుకు ముప్పాళ్ల గోపిక, నందిగామ మండలం తొర్రగుడిపాడు 8వ వార్డుకు మోర్ల కల్పన, పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం 2వ వార్డుకు కొదమల పిచ్చమ్మ, పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు 6వ వార్డుకు పిడమర్తి తులశమ్మ, తిరువూరు మండలం వామకుంట్ల 8వ వార్డుకు పున్నం

(మిగతా 6లో)



వైసిపికి యార్లగడ్డ గుడ్‌బై

చంద్రబాబు ఆహ్వానం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - గన్నవరం : వైసిపి నేత యార్లగడ్డ వెంకట్రావు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పెనమలూరు మండలం కానూరులోని యార్లగడ్డ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఆయన తన అనుయాయులు, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం తన రాజకీయ

(మిగతా 6లో)

యార్లగడ్డ ముందే నిర్ణయం తీసుకున్నారేమో : సజ్జల వార్త 6లో

విభేదాలు సద్దుమణిగేనా?

గ్రూపులుగా టిడిపి నేతలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, విజయవాడ

టిడిపిలో అంతర్గత పోరు చాపకింద నీరులా ఉంది. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి టికెట్ కోసం ఒకరికంటే అత్యధికులు రంగంలో ఉన్నారు. ఎన్నికల్లో తమకే టిక్కెట్ వస్తుందని ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. టిడిపి అధిష్టానం దీనిపై స్పష్టత ఇవ్వకపోడంతో కార్యకర్తలు ఆయోమయానికి గురవుతున్నారు. ఈనెల 19 నుండి 22వ తేదీ వరకు నాలుగు రోజులపాడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరగనున్న నేపథ్యంలో ఆ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఏమేరకు సర్దుబాటు అవుతాయో చూడాలి. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు సొంత జిల్లా ఆ పార్టీకి ఒకప్పుడు కంచుకోటగా ఉండేది. కానీ 2019 ఎన్నికల్లో విజయవాడ తూర్పు, గన్నవరం అసెంబ్లీ స్థానాలే దక్కాయి. అంతేగాక గన్నవరం నుండి గెలుపొందిన వల్లభనేని వంశీ వైసిపికి దగ్గరయ్యారు. తూర్పు నుండి గెలుపొందిన గద్దె రామమోహనరావు ఒక్కరే మిగిలిపోయారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసేదానిలో భాగంగా

(మిగతా 6లో)



నేడు ఉమ్మడి కృష్ణాజిల్లాలోకి లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి-విజయవాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర శనివారం ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పార్టీ నియోజకవర్గాల ఇన్చార్జులు, నాయకులు, ఆపార్టీ శ్రేణులు విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద లోకేష్‌కు

(మిగతా 6లో)

చలపాకకు సీనియర్ ఫెలోషిప్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కవి, రచయిత చలపాక ప్రకాష్ కేంద్రప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వారి సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. 2020–2021 సంవత్సరానికి గాను ఈ ఫెలోషిప్ "తెలుగు సాహిత్యంలో కరోనా కల్లోలం" అనే అంశంపై రెండేళ్లపాటు పరిశోధించి పత్రసమర్పణ చేశారు. గతంలో కూడా ఆయన "అత్యాధునిక కవితారూప ప్రక్రియ–నానీ' అనే అంశంపై పరిశోధన చేసి జూనియర్ ఫెలోషిప్ అందుకున్నారు.




అర్హులకే అసైన్డ్ భూములపై హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై హక్కులను అర్హులైన వారందరికీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా జిల్లా కార్యదర్శులు కోట కళ్యాణ్, కె.శ్రీదేవి డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై అర్హులకు హక్కులు కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలవరం మండలంలో చంద్రగూడెం, పొందుగల, వివిధ గ్రామాల్లో గతంలో ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీగా ఏర్పడి భూములు సాగు చేస్తున్న వారికి శాశ్వత హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రాల పోరాట నగర్, కొత్తగూడెం గ్రామాలతో పాటు రెడ్డిగూడెం, విజయవాడ రూరల్, జి.కొండూరు మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసుకుంటున్న పేదలందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రావూరి రమేష్ బాబు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి.నాగేశ్వరరావు, సందిపాము ఇసాక్, లంక వెంకటేశ్వరరావు, మైలవరం భూ పోరాట కమిటీ సభ్యులు కోట సురేష్, పౌలు, అబ్రహం, తోమంద్రు యేసు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



రోడ్డు అభివృద్ధి చేయాలని చేస్తున్న ధర్నాకు మద్దతిచ్చిన సిపిఎం నాయకులు

రహదారి అభివృద్ధి చేయాలని దీక్ష

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు బస్ స్టాండ్ ఔట్ గేటు నుండి బైపాస్ రోడ్డు సూర్యా రెస్టారెంట్ వరకు అధ్వానంగా ఉన్న రహదారిని అభివృద్ధి చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని జనసేన పార్టీ అధ్వర్యంలో బస్టాండ్ ఔట్ గేటు వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. మోకాళ్ల లోతు గోతులతో ఉన్న ఈ రోడ్డును అభివద్ధి చేయడంలో వైసిపి ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ ఆరోపించారు. తిరువూరు నగర పంచాయతీ పాలకవర్గానికి అభివద్ధి పట్ల చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు. గోతుల్లో పడి వాహనదారులు, పాదచారులు గాయాల పాలవుతున్న సంబంధిత ఏరియా కౌన్సిలర్లకు గాని, ఎమ్మెల్యేకు గాని బాధ్యత లేక పోవడం దుర్మార్గమన్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని జనసేన నాయకులు ఉయ్యూరు జయప్రకాష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, బి.వెంకటే శ్వరరావు, మరకాల ప్రకాశరావు, కెవి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంతో పాటు నియోజకవర్గ అభివద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నూతనంగా హైవే బస్టాండు ఏర్పాటు, టిటిడి కళ్యాణ మండపం, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో నిధులు ఖర్చు చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల పట్టణంలోని పాత శివాలయం రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలు, పంచాయతీ నిధులు రూ.4 లక్షలు, గడపగడపకు–మన ప్రభుత్వం నిధులు రూ.7.60 లక్షలు వెరసి మొత్తం కలిపి రూ.24 లక్షల అంచనా వ్యయంతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలను శుక్రవారం నందిగామ డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రారంభించారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎన్టీఆర్ జిల్లా ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని, ఈ పాదయాత్రలో ఉమ్మడి కష్ణా జిల్లాల నుండి నాయకులు, కార్యకర్తలు, టిడిపి శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కోరారు.

ప్లెక్సీలు తొలగింపు సరికాదు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నారా లోకేష్ యువగళ పాదయాత్ర ఈనెల 19వ తేదీ సాయంత్రం ఉమ్మడి కృష్ణా జిల్లా, విజయవాడకు వస్తున్న సందరర్భంలో వైసీపీ నాయకులు చెప్పిన మాటలకు సంబంధిత విఎంసి అధికారులు ఫ్లెక్సీలు తొలగించడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వన్‌టౌన్ రథం సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఏ అధికారికి ఫోన్ చేసిన స్విచ్ ఆఫ్ అని వస్తుందని, నేడు జరిగే నారా లోకేష్ పాదయాత్ర కోసం తమ పార్టీ తరపున ఏర్పాటుచేస్తున్నా ఫ్లక్సీలు, బ్యానర్లు విఎంసి తొలగిస్తుందని, కార్యక్రమం అవకుండా ఫ్లక్సీలు ఎలా తొలగిస్తారని బుద్ధా మండిపడ్డారు. దమ్ముంటే ఏ ఒక్క వైసీపీ నాయకుడైనా వచ్చి ఫ్లెక్సీలపై చేయి వేయండి మీ సంగతి చూస్తామని తెలిపారు.

మునేరు ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుని శుక్రవారం రైతు సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో వరదలకు దెబ్బతిన్న రాజీవ్ మున్నేరు చెక్ డ్యామ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ ఆనకట్టకు గండ్లు పడటం వలన నీరంతా వథాగా కిందకు వెళుతుంది. మరమ్మత్తులు వెంటనే చేపడితే నీటిమట్టం పెరిగి సాగుకు నీళ్లు సరిపోతాయి. ఈ ఆనకట్ట మరమ్మత్తులకు సుమారుగా రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. తక్షణమే నిధులు విడుదల చేసి, ఆనకట్టను బాగు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా రైతు సంఘం పరిశీలనలో వెల్లడైన అంశాలు:

1) పోలంపల్లి చెక్‌డ్యామ్‌కు వరుసగా 3 గండ్లు పడ్డాయి. 20 అడుగులు ఉన్నాయి. వాటిని వెంటనే ప్రభుత్వం పూడ్చాలి. 2) ప్రథమ దశలో బ్రిటిష్ వారు కట్టిన గోడ 4 అడుగుల సుమారు 15 మీటర్ల పొడవునా వరదలకు కొట్టుకుపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు మిర్చి, ప్రత్తి, వరినాట్లు వేసుకోవడానికి నారు పోసి ఉన్నారు. నాట్లు పడాలంటే మున్నేరు చెక్ డ్యామ్‌కు వెంటనే మరమ్మతులు చేసి, వథాగా వెళుతున్న నీటిని నిల్వచేసి, నీటి నిలువ సామర్థ్యం పెంచి ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.చంద్రశేఖర్, రైతుసంఘం జిల్లా నాయకులు సిహెచ్ హనుమంతరావు, మండల కార్యదర్శి టి.రాంబాబు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి రమేష్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.



సామినేనికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

మున్సిపల్ కార్మికుల మానవహారం

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ (సిఐటియు) మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, సిఐటియు నాయకులు ఎస్‌కె.పీరు మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి నేడు నోరు మెదపడం లేదన్నారు. నగరాలను పరిశుభ్రం చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా మొండి వైఖరి ప్రదర్శించడం ప్రభుత్వానికి తగదని, మోడీ, జగన్ ప్రభుత్వాలు ధరలు, పన్నులు పెంచుతూ కార్మికుల జీవితా లను దెబ్బతీస్తు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టులు తెరిపించిన లెక్కచేయడం లేదన్నారు. వివిధ విభాగాల (పారిశుధ్య, వాటర్, డ్రైనేజీ, పార్కు, వెహికల్ డిపో కార్మికులకు నాలుగేళ్లలో నయా పైసా జీతం పెంచలేదని, కార్మికులందరికీ 26 వేల కనీస వేతనం చెల్లించాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, సంధ్య, జ్యోతి, దుర్గ భవాని, డివిజన్ కార్మికులు పాల్గొన్నారు



కార్మికుల మానవహారం

షాపు గుమస్తాలకు జీతాలు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : షాపు గుమస్తాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ షాపు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లో ధర్నా జరిగింది. ప్రభుత్వానికి, షాపుల యాజమాన్యానికి వ్యతిరేకంగా షాపు గుమస్తాలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...పెరిగిన ధరలకనుగుణంగా విజయవాడ నగరంలో పని చేస్తున్న షాపు గుమస్తాలకు జీతాలు పెంచాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలు సార్లు ఆందోళనలు, వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం ఉండటం లేదని అన్నారు. విజయవాడ నగరంలో వివిధ వ్యాపార వాణిజ్య సముదాయాలలో 45 వేల మందికి పైగా షాపు, షాపింగ్ మాల్స్‌లో షాపు గుమస్తాలు పని చేస్తున్నారని, వీరిలో 45 శాతం మంది శ్రామిక మహిళలు పని చేస్తున్నారని అన్నారు. వీరందరికీ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి జీతాలు పెంచాల్సి వుందని అన్నారు. కానీ 15 సంవత్సరాలు కావస్తున్నా షాపు గుమస్తాలకు జీతాలు పెంచలేదని మండిపడ్డారు. కనీస వేతనం సవరిస్తూ జీఓ చేయడం వల్ల ప్రభుత్వానికి ఎటువంటి భారం పడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె. దుర్గారావు, ఎం.వి సుధాకర్, షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకటేశ్వరావు (కొండ) వై.సుబ్బారావు,షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర నాయకులు జి.ఈశ్వర్ కుమార్, సి. హెచ్.శివరావు, షాపు గుమస్తాలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న షాపు గుమస్తాలు, మద్దతిస్తున్న సిఐటియు నాయకులు



స్థానికులతో మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

నిరుపేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి నిరుపేదల ఆర్థికాభివద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయ పరిధిలోని పాతపేటగడ్డ వద్ద నుండి శుక్రవారం ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాలకుల మాదిరిగా ప్రచారానికే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ సచివాలయాలు కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పట్టణ మహిళా అధ్యక్షురాలు మూసిని రాజ్యలక్ష్మి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోలి రామేశ్వరి, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కాపూడి గాంధీ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కింగ్ రజా స్టార్ రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్‌లో నూతనంగా కింగ్ రజా స్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు మహమ్మద్ హఫీజ్, పటాన్ షబ్బీర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, కంచికచర్ల ఎంపిపి మాలిక్, పెద్ద మసీదు ముత్తావలి మహమ్మద్ ఖాజా మొహిద్దిన్, బుడేమియా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

దోసెడు బియ్యం.. అనాథ వృద్ధులకు సాయం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని శ్రీ జయ సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం ప్రతి విద్యార్థి దోసెడు బియ్యం స్కూల్ యాజమాన్యానికి అందించారు. సేకరించిన రెండు బస్తాల బియ్యం సంచులను మాగల్లులోని ఖాసిం అండ్ ఖాసిం అనాథ వద్ధాశ్రమానికి అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవాతత్పరత, మనవత్వం వంటి సుగుణాలు వికసిస్తాయని ప్రిన్సిపల్ పి.విజయలక్ష్మి అన్నారు. విద్యార్థులను అభినందించారు. అనంతరం మాగల్లులోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, స్కూల్ యాజమన్యం విజయలక్ష్మి, రాంమ్మోహన్ దంపతులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మద్దతుగా టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశంలో బొడ్డపాడు సర్పంచి మూడే శివశంకర్ తమ గ్రామం సచివాలయ నిర్మాణం లో అవకతవకలు జరిగాయని, పంచాయతీ తీర్మానం లేకుండా రూ. 7 లక్షలు వైసిపి నాయకుడికి కట్టబెట్టారని దీనిని నిలదీసి అడిగినందుకు సర్వసభ్య సమావేశం నుండి తనను పోలీసులు చేత బయటికి గెంటించారని, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న రాక్షస ప్రభుత్వం నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ టిడిపి శ్రేణులు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ ఎన్నుకున్న ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించమని మండల పరిషత్ సమావేశంలో కోరిన సర్పంచిని పోలీసులతో బయటకు గెంటేయడం తగదన్నారు. సచివాలయం భవనం కట్టడానికి మూడున్నర ఏళ్ళు పట్టిందా, సచివాలయం నిర్మాణం పేరుతో చెక్కులు తీసుకెళ్లడం తప్ప పనులు చేయకపోవడం ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ దోపిడీకి నిదర్శనం అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో జరిగిన ఘటనకు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తక్షణమే క్షమాపణ క్షమాపణ చెప్పాలి అన్నారు. ఎంపీడీవో స్వర్ణలతకు వినతిపత్రం అందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు మాట ఇచ్చినట్టు వచ్చేనెల 20 తారీకు లోపు సచివాలయం పూర్తిచేయాలని లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్, మండల కార్యదర్శి లుక్కా రేణుక రావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి , మచిలీపట్నం పార్లమెంట్ నాయకులు అంజి రెడ్డి, గరికపర్రు ఎంపీటీసీ నర్రా అప్పారావు , వీరంకి వరహాలరావు , గ్రామ పార్టీ అధ్యక్షులు గొరిపర్తి గోపయ్య , కొత్తపల్లి కిరణ్ , గొల్ల శివ ,వల్లూరు రాంబాబు, నెక్కలపూడి మురళి, వల్లూరు రమేష్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు


సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం) : ఉంగుటూరు మండలం వెల్దిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 66 సైకిల్స్ శుక్రవారం పంపిణి చేశారు. సుమారు 4.50 లక్షలు విలువైన సైకిళ్లను విన్సెంట్ ఫెర్రెర్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏరియా మేనేజర్ రామంజనీయులు ,వెల్దిపాడు గ్రామ సర్పంచ్ లాం నాగేశ్వరరావు ,మండల పరిషత్ ఉపాధ్యక్షులు -2 కె. చంద్రశేఖర్, జి.ఎస్.వి శేషగిరి రావు ఎం.పి.డి.ఓ, మండల విద్యాశాఖధికారి జి.వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చదరంగం పోటీల్లో త్రివేణి విద్యార్థికి మొదటి బహుమతి

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన గుడివాడ స్కూల్స్ అసోసియేషన్ ఓపెన్ టోర్నమెంట్‌లోని చెస్ పోటిలలో గుడివాడ త్రివేణి విద్యార్థి కొన్నె మోక్షజ్ఞ ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ ఎన్.శివశంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక పాటిమిద గల త్రివేణి పబ్లిక్ స్కూల్ మెక్షజ్ఞను పాఠశాల యాజమన్యం ఘనంగా సత్కరించారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : శాసనసభ మాజీ సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మోపిదేవి మండల పరిధిలోని నాగాయచెప్ప గ్రామ పంచాయతీ లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును శుక్రవారం రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవ కొల్లు నరసింహారావు తో నరసింహారావు తో కలిసి రమేష్ బాబు ప్రారంభించారు. రామాలయం నుంచి పోతరాజు గుడి వరకు ఐదు లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో రూ 4.16 లక్షల పంచాయతీ నిధులతో 85 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షులు జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. బుద్ధ ప్రసాద్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు అసత్య ప్రచారాలకు పూనుకున్నారని అదేవిధంగా అవనిగడ్డ నియోజకవర్గం లో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను వక్రీకరించి ప్రజలను మభ్య పెట్టే విధంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన మాటలను నియోజకవర్గ ప్రజలు నమ్మరని అదేవిధంగా జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేసి బుద్ధ ప్రసాద్ చేస్తున్న అసత్య ప్రచారాలను కార్యకర్తలు నాయకులు తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సనక వెంకట్ రాజేష్ బాబు, పిఏసిఎస్ ల చైర్మన్లు గరికపాటి గోవిందరాజులు, కోసూరు కోటేశ్వరరావు, తుటారం కష్ణ, పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాస్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్లు కోసూరు శివనాగుమల్లేశ్వరరావు పాల్గొన్నారు

టిడిపి మహిళా మహాశక్తిపై ప్రచారం

ప్రజాశక్తి-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను మహిళా మహాశక్తి ద్వారా మహిళలకు వివరించడానికి మండలంలోని మహేశ్వర పురం గ్రామంలో నియోజకవర్గ మహిళా కమిటీ ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో ను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలసాని దివ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ1,500లు, తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ15,000 లు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్ లేని ప్రయాణం తదితర టిడిపి అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాకాని సుధారాణి, చాట్ల పున్నమ్మ, ఈడుపుగంటి లక్ష్మి శ్రీ, జువ్వనపూడి సరోజిని, జుజ్జువరపు పద్మజ, పాతూరి సంపూర్ణ, పాతూరి సరోజినీ, పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ విభాగం నాయకుడు కలపాల కిషోర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గన్నవరం నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌ను కోరిన ఎంఎల్‌ఎ వంశీమోహన్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గన్నవరం నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని గన్నవరం శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును కోరారు. కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లను కలసి గన్నవరం నియోజకవర్గ పరిధిలోని సమస్యలను వివరించారు. ప్రధానంగా కేసరపల్లి బ్రిడ్జి నిర్మాణం, మల్లవల్లి గ్రామ ప్రజలకు ఇళ్ల స్థలాలు, తెంపల్లి గ్రామంలో మంచినీటి పైపులైన్ నిర్మాణం వంటి పనుల సమస్యలకు పరిష్కారంపై వారు చర్చించారు. గన్నవరం మండలంలోని కేసరపల్లి వద్ద సుమారు 3,500 మందికి జగనన్న లేఔట్లలో ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే ఆ స్థలాలకు ఇళ్ల నిర్మాణ సామాగ్రిని తీసుకు వెళ్లేందుకుగాను సరియైన అప్రోచ్ రోడ్డు లేకపోవటంతో రూ.3 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందించడం జరిగిందని గన్నవరం శాసనసభ్యులు వివరించారు. అందుకు ప్రతిపాదించిన నిధులను పెంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించేందుకు సర్వే, ఇరిగేషన్, గుడివాడ ఆర్డీవో, హౌసింగ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ విభాగాలు అక్కడి పరిస్థితులను ఉమ్మడి సర్వే చేసి రిపోర్టును సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మల్లవల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ కు భూములు ఇచ్చిన ఆ గ్రామ ప్రజల ప్రతి రేషన్ కార్డుదారునికి రూ.యాభై వేలతో పాటు ఎకరానికి రూ.7.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. సేకరించిన 14 వందల ఎకరాలలో 13 వందల ఎకరాలను ఎస్టేట్స్ కు కేటాయించారని, మిగిలిన వంద ఎకరాలలో ఆ గ్రామ ప్రజలకు స్థలాలను ఇచ్చేందుకుగాను, భూమిలేని వారికి మాత్రమే అనే నిబంధన కాకుండా ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయవలసిందిగా ఆయన కలెక్టర్ ను కోరారు. సమావేశంలో గుడివాడ డివిజన్ ఆర్డీవో పి.పద్మావతి, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్ రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, ఎన్టీఆర్ జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, గన్నవరం తహసిల్దారు నరసింహారావు, తెంపల్లి గ్రామ సర్పంచ్ కొలుసు శిరీష, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్, జేసీలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వంశీమోహన్



పాడి పరిశ్రమాభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పమిడిముక్కల : జగనన్న పాల వెల్లువ ద్వారా గ్రామాలలో పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని, ప్రతి ఒక్కరూ వాలంటీర్ల ద్వారా జగనన్న పాలవెల్లువ యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని వీరంకిలాకు పశు వైద్యాధికారి రామ్ నరేష్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చెందాలంటే పాలు దిగుబడి ఎక్కువగా ఉండాలని, వాలంటీలర్లు సర్వే చేసి యాప్ ద్వారా పాడి గేదలు నమోదు చేయాలని అన్నారు. జగనన్న చేయూత ద్వారా బ్యాంకులు రుణాలు సమకూరుస్తాయని ఆయన అన్నారు.

యువగళంను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : నేటి నుండి నాలుగు రోజులపాటు కష్ణా జిల్లాలో జరిగే యువగలం పాదయాత్ర, 22 గన్నవరంలో జరిగే బహిరంగ సభ విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అనుబంధ సంఘాల కు అభిమానులకు ఉమ్మడి కష్ణా జిల్లా టిడిపి నేతల పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఉమ్మడి జిల్లాల నేతలు మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు దేశ రాజకీయాల్లో నారా లోకేష్ “యువగళం” ఒక సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావ , ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, పోలీట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర , మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వ రరావు, గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జ్ రావి వెంకటేశ్వరరావు , పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా, పెడన నియోజవర్గ ఇన్చార్జ్ కాగిత కష్ణ ప్రసాద్ , రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం(బోస్) తదితరులు పాల్గొన్నారు.



యథావిధిగా చేపల అమ్మకాలు : సర్పంచ్

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని సంత మార్కెట్లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన భవనంలో సంత మార్కెట్లో గతంలో అమ్ముకునే చేపలు అమ్మకపుదారులు తమ చేపలను యధావిధిగా అమ్ముకోవచ్చని కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న షైనీ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మత్స్యకారులతో మత్స్య శాఖ అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి లు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా పలువురు చేపల అమ్మకదారులు తమ అనుమానాలను అధికారుల దష్టికి తీసుకురాగా ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ అక్కడ నిర్మించిన భవనాలు ఎవరికి ఇవ్వలేదని, కేవలం ప్రచార మాత్రమేనన్నారు. గ్రామపంచాయతీ కేటాయించిన స్థలంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో షెడ్డును నిర్మించడం జరిగిందని, ఆ షెడ్డులో 5 గదులను వేరే వాళ్ళ కేటాయించారని అనే ప్రచారం కేవలం అపోహ మాత్రమేనని, తప్పనిసరిగా మీరు కోరుకున్న విధంగానే అక్కడ చేపలు అమ్ముకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి వానపల్లి సత్యనారాయణ, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ వెన్న ప్రసాద్, గ్రామ మత్స్య శాఖ అధికారి కోల నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నేడు పాయకాపురం సబ్ స్టేషన్ ఏరియాలో 11 కె.వి, ఎల్ఐసి కాలనీ ఫీడర్ లైనుల మరమత్తులలో భాగంగా ఎల్ఐజి కాలనీ, ఎమ్ఐ జి కాలనీ, ఉడా కాలనీ, ఓల్డ్ రాజీవ్ నగర్, ప్రాంతాల్లో ఈ నెల 19వ తేదీ శనివారం ఉదయం 8.00 గంటల నుండి10.00 గంటల వరకు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని కావున వినియోగదారులు గమనించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో జైస్ వైద్య సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కంటి చికిత్సలో జైస్ సంస్థ అత్యాధునిక సాంకేతిక పద్ధతితో వైద్య సేవలను అందిస్తున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి ఈశ్వర్ కుమార్ తెలిపారు. నగరంలోని జైస్ స్మైల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జైస్ స్మైల్ అనేది లేజర్ కంటి శస్త్ర చికిత్సలో చక్కటి సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రోగులకు మయోపియా, ఆస్టిగ్మాటిజం వంటి సాధారణ దృష్టి సమస్యలకు నమ్మకమైన, ఖచ్చితమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. 2008లో జైస్ సంస్థ ప్రారంభమైనప్పటి నుండి సంస్థ కార్యాలయాల ద్వారా విశేషమైన సేవలను అందిస్తుందని తెలిపారు. అలాగే కంటి సంరక్షణ నిపుణులు, రోగుల నుండి విస్తృతమైన సేవలు అందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యం పట్టని పాలకులు : టిడిపి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం గ్రామంలో ప్రజల ఆరోగ్యం జ్వరాలతో కుంటుపడుతోందని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి బందం జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాధారణ, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, పారిశుధ్య చర్యలు చేపట్టడంలో సచివాలయాలు విఫలమయ్యాయని, పాలకులు, అధికారులు తక్షణం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మాజీ సర్పంచ్ జానాలపాటి వేణుగోపాల్ రెడ్డి, ఉయ్యూరు బొర్రా రెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో బుధవారం యుటియఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కొత్తపేట, పరిటాల, గని ఆత్కూరు, చెవిటికల్లు, మోగులూరు తదితర గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సభ్యత్వం నమోదు చేశారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి బి.హరిప్రసాద్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి జి.వి.గంగాధర్, కోపూరి నాగేశ్వరరావు, నాయకులు కె.ఫణీంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటియఫ్ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జిపియస్ రద్దు చేసి సిపియస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల అనంతరం, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విగ్రహాలు తొలగించడం మంచి పరిణామం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్లో విగ్రహాలు తొలగించటం అనేది చాలా మంచి పరిణామం అని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ ముందుగా రైతు పేటలోని సిఎం రోడ్డుని మార్చి ఎన్టీఆర్ రోడ్డుగా తీర్చిదిద్ది వారి పనితనాన్ని ప్రజలకు నిరూపించారు. గత రెండు సంవత్సరముల గా నందిగామ అభివద్ధికి చాలా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి కార్యక్రమానికి కూడా ఎన్నడూ లేని విధంగా అఖిలపక్షాన్ని పెట్టి వారి అభిప్రాయాలు తీసుకుంటూ ముందుకు వెళుతున్నారు. ప్రతి కార్యక్రమంలో కూడా తెలుగుదేశం పార్టీ వారు పాల్గొంటూ ఆమోదం తెలుపుతూ ఏదో ఒక చిన్న చిన్న కారణాలు వెతుకుతూ ఆందోళన చేస్తున్నారు. ఇది సమంజసం కాదు కోర్టు ఉత్తర్వులను అనుసరించి విగ్రహాలు తొలగిస్తుంటే కూడా అభ్యంతరమా అని ప్రశ్నించారు.

బోరింగ్ పంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని అన్ని బోరింగ్ పంపులకు మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొలుసు రమాదేవి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో వత్సవాయి గ్రామ సర్పంచ్ భూక్య సీతమ్మ, జడ్పిటిసి సభ్యురాలు ఏసుపోగు దైవమణి వైఎస్ ఎంపిపి కొలకపోగు వెంకటేశ్వర్లు, మండల వైసిపి పార్టీ అధ్యక్షులు రంగిశెట్టి ముక్తేశ్వరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కమల



జగ్గయ్యపేటలో కరపత్రాలు చూపుతున్న కార్మికులు



వీరులపాడులో...

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, వీరులపాడు: మండలంలో చిలకల్లు తెర్లగంటపాలెం వేదాద్రి ఆటోనగర్ జగ్గయ్యపేట బలుసుపాడు, సంతకాల సేకరణలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, చిల్లకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద కార్మికులనుద్దేశించి ఎ.కమల మాట్లాడారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించుకుని వినతిపత్రాలు అందజేసిన పట్టించుకోకపోవడంతో, దశలవారీగా, ఆందోళన పోరాటాలకు సిద్ధమయ్యారని ఆమె తెలిపారు. కార్మికుల పట్ల, వారి సమస్యల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. వారు చేస్తున్న ఆందోళన పోరాటాలకు కార్మికుల తరఫున సిఐటియు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పవర్ జెఎసి రాష్ట్ర ప్రభుత్వంతో, ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులకు తెలియజేయకుండా, వారి అంగీకారం లేకుండా, పవర్ జెఎసి ఒప్పందం చేసుకోవటం చట్ట వ్యతిరేకమని, ఆ ఒప్పందాన్ని ఉద్యోగ కార్మికులు అంగీకరించడం లేదని, తక్షణమే కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకొని, ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టాలని, అప్పటివరకు కార్మికుల పక్షాన పోరాడతామని హెచ్చరించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు రివర్స్ పి.ఆర్ అమలు చేసి, కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.40 వేలు జీతం అందుతుంటే, మన రాష్ట్రంలో రూ.21 వేలు మాత్రమే అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా, జె.ఏసు రత్నం, ఐ.ఎస్ రాజు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఎంపి నిధులతో వాటర్ ట్యాంకర్లు మంజూరు



నందిగామలో మంచినీటి ట్యాంకర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలో ఎంపి కేశినేని శ్రీనివాస్ నిధులతో మంజూరైన రూ.42.50 లక్షల వ్యయంతో నియోజకవర్గానికి 17 నూతన వాటర్ ట్యాంకర్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తూ ప్రజలకు మేలు చేసేందుకు, అభివద్ధికి సహకరిస్తున్న ఎంపి కేశినేని నానికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. మంచినీటి పైపులైన్లు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు పలు దఫాలుగా ట్రాక్టర్ల వాటర్ ట్యాంకర్లు, రక్షిత మంచినీటి స్టోరేజ్ ట్యాంకులకు ఎంపీ కేశినేని నాని సహకారం అందజేయడం మంచి పరిణామం అన్నారు. నియోజక వర్గంలోని చందర్లపాడు మండలానికి 8 ట్యాంకర్లు, కంచికచర్ల మండలానికి 2, చందర్లపాడు మండలానికి 3, వీరులపాడు మండలానికి 3 ట్యాంకర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎఎంసి చైర్మన్ మస్తాను జడ్పిటిసి సభ్యులు గాదెల బాబు, మారం అమరయ్య కట్టప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్యాలయం తనిఖీ



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాన్ని ట్రాన్స్‌కో జనరల్ మేనేజర్ ఫైనాన్స్ కె.వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీటర్ బిల్డింగు గురించి వాకబు చేశారు. ఫీల్డ్‌లో తిరిగి కొన్ని కరెంటు మీటర్లు తనిఖీ చేశారు. నందిగామ ట్రాన్స్‌కో కార్యాలయంలో మీటర్ రీడర్లు లైసెన్సు, విద్యుత్తు రెవెన్యూ సిబ్బందితోపాటు ఎఇ, ఎడిఇ, విజయవాడరూరల్ ఇఇతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన కరెంటు అందించాలని, బకాయిలు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఇఇ జిబి.శ్రీనివాసరావు, నందిగామ ఎడిఇ వి.రమేష్ బాబు, ఇఆర్వో సర్వయ్య, ఏఈ దెబ్బయ్య ఏవో శ్రీనివాస్ రెడ్డి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోరం ఫర్ ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో ...

20న ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్, ఆర్ట్ కాంటెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



చిత్రాలను చూస్తున్న మండలి, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో మొబైల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్, ఫొటో ఆర్ట్ కాంటెస్ట్‌ను ఈ నెల 20వ తేదీన నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కన్వీనర్ సునీల్ కుమార్ తెలిపారు. రాఘవయ్యపార్కు వద్ద గల బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా దాగియున్న ఫొటోగ్రఫీ టాలెంట్‌ను వెలికితీయాలని వారు మొబైల్స్‌తో వండర్స్ క్రియేట్ చేయవచ్చని నిరూపించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మొబైల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌లో 20 మంది యువ ఫొటోగ్రాఫర్స్ తీసిన 80 చిత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఆదివారం ఉదయం 10 గంటలకు సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీ ప్రసాద్ లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని ప్రవేశం ఉచితమని ఔత్సాహికులు ఎవరైనా తిలకించవచ్చని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య 6 నుండి 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు వినూత్నంగా ఫొటో ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5వ గంటలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ ఇండ్ల స్వప్న ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అతిథులుగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ప్రతినిధి పిన్నమనేని మురళీకృష్ణ, జిఆర్‌కె అండ్ పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, సోమూరి కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ రేష్మా పాల్గొంటారని తెలిపారు. ఈపోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, ఈవెంట్ మేనేజర్ స్ఫూర్తి శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు కళాసాగర్, ఎస్.పి.మల్లిక్, శ్రావన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : వేములనర్వ గ్రామంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ జస్వంత్ రెడ్డి పాడి పశువులకు చూడి పరీక్షలు, తిరగకట్టడం, కత్రిమ గర్భధారణ, పొదుగువాపు, చర్మ వ్యాధులు తదితర సమస్యలకు వైద్యం చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ వైద్య సిబ్బందిని ప్రశంసించారు. ఈ శిబిరంలో కెవికె శాస్త్రవేత్త డా.రాజశేఖర్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వీరభద్రం, రాకేష్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది శ్రావణి, నవ్య, సంధ్య, నరసింహారావు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి : ఎసిపి

ప్రజాశక్తి - మైలవరం : దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎసిపి ఎం.రమేష్ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మేడసాని కిషోర్ కుమారుడు సిద్విల్ సాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జి.కొండూరు మండలం కొండముక్కల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్, బ్లూటూత్ స్పీకర్‌ను, మైలవరంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

సిఎంను కలిసిన పరిటాల సర్పంచ్

ప్రజాశక్తి - కంచికచర్ల : విజయవాడ పట్టణంలోని ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కంచికచర్ల మండలం పరిటాల గ్రామ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జోష్ణ వైసిపి నాయకులు యద్దనపూడి విజయరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవటం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రాజ్ భవన్‌లో టాప్ ఫైవ్ పంచాయతీల్లో ఒకటైన పరిటాల పంచాయతీ తరపున విందుకు ఆహ్వానించడంతో పాల్గొన్నట్లు తెలిపారు.

శ్రావణ మాసం పూజలు

ప్రజాశక్తి - కంచికచర్ల : శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక మహాలక్ష్మి దేవాలయం, శివాలయం, వెంకటేశ్వర దేవాలయం, శివ సాయి క్షేత్రం, వినాయకుని దేవాలయంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టిడిపి ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- నందిగామ : జాతీయ నాయకుల విగ్రహాల తొలగింపు లో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ వైఖరి నిరసిస్తూ శుక్రవారం రాత్రి టిడిపి కార్యాలయం నుండి గాంధీ సెంటర్ వరకు కొవ్వొత్తులు, కాగడాలతో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దేవినేని ఉమ, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వినాశకాలే విపరీతి బుద్ధి అంటూ ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ దుర్మార్గాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..



బాధ్యతలు స్వీకరిస్తున్న జ్యోతిబసు

సమగ్ర శిక్ష ఇన్చార్జ్ ఎపిసిగా జ్యోతిబసు బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఇన్చార్జి ఎపిసిగా వీర్ల జ్యోతి బసు శుక్రవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం అధికారి ఏ.శ్రీనివాసరావు ఇంఛార్జి గా వ్యవహరించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జ్యోతి బసు కు పూర్తి అదనపు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఇంజినీరింగ్ , అధికారులు, ఉద్యోగులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత స్వాతంత్ర సమర యోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 78వ వర్ధంతిని నాగాయలంక లోని నేతాజీ విగ్రహం సెంటర్లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యులు నాగిడి ఆదిలక్ష్మి, లంకే శ్రీనివాస ప్రసాద్, నాగిడి తాతారావు, మోపిదేవి ఆదినారాయణ, మరియమ్మ పాల్గొని నివాళులర్పించారు

రేపు గ్రూప్స్‌లో ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : త్వరలో విశాఖపట్నం, విజయవాడ మరియు తిరుపతిలో ఉన్న ఎపి స్టడీ సర్కిల్ బ్రాంచ్‌లో ప్రారంభించనున్న సివిల్ సర్వీసెస్, గ్రూప్-1 మరియు గ్రూప్-2 పరీక్షల కోసం ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రామ్ కోసం 11,008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి షాహిద్ బాబు షేక్ తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులో ఎంచుకున్న కేంద్రాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఈ విషయన్ని ఇప్పటికే అభ్యర్థులకు వ్యక్తిగతంగా గత 10 రోజుల్లో మూడుసార్లు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించామన్నారు. అయినా ఇప్పటికీ, కొంతమంది అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్లోడ్ చేసుకోలేదని కాబట్టి, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ తమ హాల్ టిక్కెట్లను apstdc. apcf-ss.in పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావాలన్నారు.

కృష్ణా వర్సిటీలో హరితహారం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు నా మట్టి - నా దేశం అనే కార్యక్రమాన్ని ఆజాదీ కా అమత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎన్.సి.సి విద్యార్థులు మొక్కలను నాటి పరిసరాలను పరిశుభ్రం చేశారు.విశ్వవిద్యాలయ అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్ లెఫ్టినెంట్ డా. డి.రామశేఖర్ రెడ్డి విద్యార్థుల చేత పంచప్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఎంతోమంది వీరుల నిస్వార్ధరహిత సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు డా. ఆర్. విజయకుమారి మాట్లాడుతూ భారత ప్రభుత్వం మన దేశ అమర జవాన్లను మరియు దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన



పౌరులను గౌరవించుకోవడానికి దేశమంతటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిందని విద్యార్థులకు గుర్తు చేశారు మరియు ఇది ఆజాదీ కా అమత్ మహోత్సవంలో చివరి కార్యక్రమంగా పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ మరియు ఫార్మసీ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సరవణకు సహకరించాలి



మాట్లాడుతున్న నగరపంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- ఉయ్యూరు : రాబోవు సార్వత్రిక ఎన్నికల తుది ఓటర్ల జాబితా రూప కల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఉయ్యూరు నగరపంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ, చేర్పులు, మార్పులు అనం తరం తుది జాబితా రూపకల్పనకు సంబంధించి నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పట్టణంలో ఓటర్ల జాబితా సవరణకు బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారని, వారితో పాటు పార్టీలనుండి ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లుండి స్థానికంగా నివసించని వారు, మరణించిన వారి పేర్లు తొలగింపు , కొత్తగా ఓటర్లు నమోదు జరుగుతుందని దీనికి అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ నుండి గుర్నాధరావు, వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు. . జనసేన నాయకుడు శివప్రసాద్, సీపీఎం నుండి రాజేశ్ బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-గుడివాడ : భారత ప్రభుత్వంచే హర్ ఘర్ జల్ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు పరిచినందుకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఎంపిక అయిన శేరివేల్పూర్ సర్పంచ్ మేడేపల్లి ప్రభాకర్‌ను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గద్దె పుష్పరాణి, జడ్‌పిటిసి గోళ్ళ రామకష్ణ, ఎంపిడివో వెంకటరమణ ఘనంగా సత్కరించారు. మండలంలో జల్ జీవన్ మిషన్ మిషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తూ కష్ణాజిల్లా నుండి ఎంపిక అయిన ఒకే ఒక గ్రామంగా శేరివేల్పూరుని నిలిపినందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ అట్లూరి వెంకటేశ్వరరావును, ఉత్తమ ప్రతిభ అవార్డులను అందుకున్న ఇఓపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.ఆనుల, ఎంజిఎన్‌ఇజిఎస్ ఇసి



సర్పంచ్‌తో పాటు అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

ఆర్.జి.రామకష్ణలను ఘనంగ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రూరల్ మండలఅధ్యక్షులు మట్టా జాన్‌విక్టర్, పార్టీ నాయకులు గద్దె రాము, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

కొరాని సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-గుడివాడ : రాష్ట్ర హమాలిస్ ఫెడరేషన్ (ఏఐటియుసి) మాజీ ప్రధాన కార్యదర్శి కొరాని నరసింహారావు 23వర్ధంతి గుడివాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ సెంటర్ నందు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుంపల నరసింహారావు, పద్మారావు, శ్రీను, జని, అనిల్, రాంబాబు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేయండి : చలసాని



ప్రజాశక్తి-గన్నవరం : పాల ఉత్పత్తి పెంపుదలకు పాడి రైతుల కషి చేయాలని కష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. శుక్రవారం ముస్తాబాద మినీ కళ్యాణ మండపంలో జరిగిన ది ముస్తాబాద పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చలసాని మాట్లాడుతూ లక్షలాది రైతు కుటుంబాలకు యూనియన్ సేవలందిస్తుందని చెప్పారు. యూనియన్ ఆధ్వర్యంలో క్షీరబంధు, కళ్యాణమస్తు, బీమా సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. నాణ్యమైన సెమను పంపిణీ చేస్తున్నామని, ఈ సేవలన్ని పాలకేంద్రాల వద్ద ప్రదర్శించి పాడి రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ముస్తాబాద పాలకేంద్రం ద్వారా 123 మంది ఉత్పత్తిదారులకు రూ.2లక్షలు బోనస్‌ను పంపిణీ చేశారు. ప్రతి నాలుగు నెలలకు క్రమం తప్పకుండా బోనస్ అందిస్తున్న యూనియన్ పాడి రైతులదని చెప్పారు. ముస్తాబాద పాలకేంద్రం అధ్యక్షుడు కడియాల గోపాలరావు(కోటయ్య) కషితో ఈ కేంద్రం గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రగతి సాధించటంతో పాటు విశేష అభివద్ధి స్వంతం చేసుకుందని ఆయనను సత్కరించారు. జిల్లా డైరెక్టర్లు దాసరి వెంకట బాలవర్ధనరావు, పాలడుగు నాని. పలగాని కొండలరావు, జీఎం అనిల్ కుమార్, రూట్ మేనేజర్ కోటా ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు కడియాల గోపాలరావు, రైతులు హాజరయ్యారు. పాలకేంద్రం యాజమాన్యం అతిథులను ఘనంగా సత్కరించింది.

గండిగుంటలో పోలింగ్‌కు సర్వంసిద్ధం

ప్రజాశక్తి-ఉయ్యూరు : గండిగుంట 10వ వార్డుకు శనివారం జరిగే వార్డుసభ్యుని ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వార్డులో 394 ఓటర్లు ఉండగా అందులో 200 మంది పురుషులు, 194. మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో ఈవార్డునుండి వైసీపీ మద్దతుతో విజ యం సాధించిన సభ్యుని మరణంతో ఉపఎన్నిక జరుగుతుంది. ప్రస్తుతం టీడీపీ మద్దతుతో వీరంకి పాండురంగారావు, వైసీపీ మద్దతుతో మోర్ల యోగేశ్వరరావు పోటీలో నిలిచారు. ఉదయం 7 గంటల నుండి 1 గంటవరకు పోలింగ్ నిర్వహించి 2గంటలకు ఓట్ల లెక్కింపు తరువాత ఫలితం వెల్లడించనున్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రామంలో వార్డు ఉప ఎన్నిక స్థానిక వైసీపీ, టీడీపీ నా యకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయం సాధించేందుకు సర్వ శక్తులు వొడ్డుతున్నారు. కాగా పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన సామాగ్రితో ఎన్నికల అధికారితో పాటు మరో ముగ్గురు సహాయకులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నుండి పోలింగు బూత్ కు తరలివెళ్లారు.

యువగళం సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 22వ తేదీన గన్నవరంలో జరిగే నారా లోకేష్ యువ గళం సభ లక్ష మందితో జరుగు తుందని యువ గళం ప్రోగ్రాం ఇంచార్జివై. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం గన్నవరంలో జరుగుతున్న సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. లోకేష్ సభకు పార్టీ కార్యకర్తలు ప్రజలు రాకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీ ఆదేశాల మేరకు పోలీసులు ప్రయత్నిస్తారని తెలుస్తోందని ఆ విధమైన చర్యలకు పూనుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. ఆరు నెలల తర్వాత రాష్ట్రంలో అధికారం మారడం ఖాయమనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. యువగళం సభకు జనం రాకుండా అడ్డుకోవడం అధికార పార్టీ వల్ల కాదన్నారు. రానున్న ఎన్నికల్లో గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు 30 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న,గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవ భవనం నందు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనునట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు, మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ వైద్య శిబిరాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ఇన్చార్జ్ ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఇన్చార్జి ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న పి శైలజ కుమారికి ఆగస్టు 15 సందర్భంగా జిఎస్ డబ్ల్యూ ఎస్ ద్వారా సచివాలయ సేవలు అందించడంలో ప్రశంసపత్రం అవార్డు అందుకున్నారు. దీనితో గురువారం సాయంత్రం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యాలయం సిబ్బంది మండల పరిషత్ పాలకవర్గం సభ్యులు కలసి శైలజ కుమారుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుంగల సమితి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ కార్యాలయం సూపర్డెంట్ అతావుల్లా ఎంపీడీవోను దుశ్శాలువలు పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వర్రె నరేష్ బాబు తోట గణేష్ మండల పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు షేక్ నజీర్ భాష కార్యాలయం సిబ్బంది శశి గోపి పాల్గొన్నారు



ఇన్‌చార్జి ఎండిఒను సత్కరిస్తున్న దృశ్యం

లోకేష్ పాదయాత్రకు ఆటంకాలు సృష్టిస్తున్నారు

కలెక్టర్‌కు టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - విజయవాడ : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈనెల 19వ తేదీ నుండి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కార్యక్రమానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని టిడిపి ప్రతినిధి బృందం శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు ఫిర్యాదు చేసింది. బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను విఎంసి అధికారులు తొలగిస్తున్నారని, ఇటువంటి చర్యను వెంటనే నిలుపుదల చేయించాలని కోరారు. తూర్పు ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్‌రావు, టిడిపి ఒలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ బొండా ఉమా, మాజీ ఎంఎల్‌ఎ జలీల్‌ఖాన్, పార్టీ నాయకులు నాగూల్‌మీరా, విఎంసిలో టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామితోపాటు పలువురు కార్పొరేటర్లు తదితరులు కలెక్టర్‌ను ఆయన ఛాంబర్లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం టిడిపి బృందం మీడియాతో మాట్లాడుతూ నగరంలో అధికారపార్టీ నేతల వత్తిడికి లొంగిపోయిన అధికారులు ఆగమేఘాల మీద తమ బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం దుర్మార్గమన్నారు. ఇదే అంశంపై విఎంసి కమిషనర్ చాంబర్ ముందు టిడిపి కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, వీరమాచినేని లలిత తదితరులు బైఠాయించి నిరసన తెలిపారు.

యార్లగడ్డ ముందే నిర్ణయం తీసుకున్నారేమో : సజ్జల

ప్రజాశక్తి - విజయవాడ : గన్నవరం నేత యార్లగడ్డ వెంకట్రావు పార్టీకి గుడ్‌బై ప్రకటించడంపై వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. ఎవరికైనా వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని.. యార్లగడ్డ మాటలు చూస్తుంటే ఆయన ముందే నిర్ణయం తీసుకున్నారేమో అనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేయాలి, అవకాశం కోసం ఎదురు చూడాలి, ఎవరినీ అవమానించడం, బాధించడం అనేది ఉండదు, ఏ పార్టీలోనైనా ఇలాంటివి సహజం, ఎవరికైనా వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుంది, ఏ పార్టీలోనైనా ఆరోగ్యవంతమైన వాతావరణం ఉండాలనే కోరుకుంటాం, సమస్యలుంటే అంతర్గతంగా మాట్లాడాలే తప్పా.. వేదికలపై ఇలాంటి విషయాలు మాట్లాడకూడదు" అన్నారు. "యార్లగడ్డ గతంలో మాపార్టీ నుంచి పోటీ చేశారు. టికెట్ ఆశించేవాళ్లు ఎంతమంది ఉన్నా టికెట్ ఒకరికే వస్తుంది. ఆ విషయమే నేను యార్లగడ్డకు చెప్పాను. ఇంకేమైనా మాట్లాడాలనుకుంటే పార్టీలో మాట్లాడవచ్చు. కానీ, పబ్లిక్‌గా మీడియాతో మాట్లాడతానంటే ఎలా?. వరుసగా మీటింగులు పెట్టి అలా మాట్లాడుతున్నారు. ముందే పార్టీ మారాలనే ఇలా మాట్లాడుతున్నారేమో? ఎమ్మెల్యే టికెట్ రాకపోతే నిరాదరణ అయినట్టు కాదు. సీఎంని కలవాలని ఆయన అనుకుంటే ప్రాపర్ వేలో కలవచ్చు. లేదా నాయకులను కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు. అలా కాకుండా మీడియా ద్వారా మాట్లాడతానంటే అది కరెక్టు కాదు." అన్నారు. 'పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు ఉంటుంది. బలమైన పార్టీ అయినందున చాలామంది భవిష్యత్తును ఆశిస్తారు. కానీ, ఎవరైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే' అని సజ్జల తెలిపారు. యార్లగడ్డ ఎపిసోడ్‌లో మీడియా వక్రీకరించిన దాఖలాలు ఉన్నాయన్నారు. యార్లగడ్డను తాను అవమానించినట్లు, పోతేపోనీ అన్నట్లు కొన్ని మీడియాల్లో కథనాలు వచ్చాయన్నారు. అలా తానెందుకు అంటానని, తానే కాదు తమ పార్టీలో ఎవరూ అలాంటి వ్యాఖ్యలు చేయరని, యార్లగడ్డను ఎవరూ అవమానించలేదని, యార్లగడ్డకు మంచి భవిష్యత్తు ఉంటుందని తన వాళ్లు చెప్పారని సజ్జల పేర్కొన్నారు.

రూట్‌మ్యాప్‌పై అసంతృప్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నారా లోకేష్ యువగళం పాదయాత్ర రూట్‌మ్యాప్‌పై నగరంలోని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో పాదయాత్ర ఉన్నా కేవలం కొద్ది సమయం మాత్రమే అది ఓటింగ్ లేని ప్రధాన వీధుల మీదుగా యాత్ర రూట్‌మ్యాప్ ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఓటింగ్ , జన సంచారం ఎక్కువగా ఉన్న చోట పాదయాత్ర నిర్వహిస్తే కొంత వరకు ఫలితాలు వస్తాయని ఆశిస్తారని, కానీ నగరంలో యాత్ర ప్రారంభమైనప్పటి నుండి చివరి వరకు ప్రధాన రహదారి తప్ప నియోజకవర్గాల్లో ప్రజల మధ్య సాగడంలేదని విమర్శిస్తున్నారు. అంతేగాక ఎంతో ప్రాధాన్యత గల విజయవాడలో కొద్దిసమయం మాత్రమే ఉండడం పట్ల నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

ఎన్‌టిఆర్ సర్కిల్‌లో బ్యానర్లు



తొలగింపు

లోకేష్ పాదయాత్ర సందర్భంగా పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ చుట్టూ కట్టిన బ్యానర్లు, తోరణాలను శుక్రవారం కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. దీంతో టిడిపి నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తూర్పు ఎంఎల్‌ఎ గద్దె రామమోహనరావు అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. తమకు వచ్చిన ఆదేశాలు ప్రకారం తొలగిస్తున్నామని, కమిషనర్ కార్యాలయంలో మాట్లాడాలని సిబ్బంది పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నేడు పంచాయతీ ఉప ఎన్నికలు

గోపికృష్ణ, వత్సవాయి మండలం సింగవరం 6వ వార్డుకు చిందు వరలక్ష్మి, వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు 6వ వార్డుకు అద్దంకి బేబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

2 సర్పంచ్, 3 వార్డులకు ఎన్నికలు

వత్సవాయి మండలం పెదమోదుగపల్లి, వీరులపాడు మండలం దాచవరం పంచాయతీ సర్పంచ్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే తిరువూరు మండలం ఎర్రమాడు పంచాయతీ 7వ వార్డు, వీరులపాడు మండలం జమ్మవరం పంచాయతీ 8వ వార్డు, విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ పంచాయతీ 9వ వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

కృష్ణాజిల్లాలో ఒక సర్పంచ్, 28 వార్డులు ఏకగ్రీవం

ఒక సర్పంచ్, 8 వార్డులకు ఎన్నికలు

కష్ణా జిల్లాలో మొత్తం రెండు సర్పంచ్, 31 వార్డులకు నోటిఫికేషన్ విడుదల చేయగా, ఒక సర్పంచ్, 28 మంది వార్డు సభ్యుల పదవులు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన ఒక సర్పంచ్, ఎనిమిది వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పెడన మండలం కొంగంచర్ల గ్రామ సర్పంచ్ (జనరల్ మహిళ), బాపులపాడు మండలం మల్లవల్లి పంచాయతీ 6వ వార్డు (ఎస్‌సి), ఉంగుటూరు మండలం తాళ్లపర్రు గ్రామపంచాయతీ 4వ వార్డు (జనరల్), బంటుమిల్లి మండలం బంటుమిల్లి 4 వార్డు (ఎస్‌సి మహిళ), గూడూరు మండలం పోలవరం 11వ వార్డు (జనరల్ మహిళ), పెడన మండలం కాకర్లముడి 4వార్డు (బిసి మహిళ), కంకిపాడు మండలం కంకిపాడు పంచాయతీ 9వ వార్డు (జనరల్), పమిడిముక్కల మండలం అలినక్కిపాలెం 6వ వార్డు (జనరల్ మహిళ), ఉయ్యూరు మండలం గండిగుంట పంచాయతీ 10 వార్డు (బిసి)లకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక సర్పంచ్ పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటీపడుతుండగా, 8 వార్డులకు 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీటిలో కంకిపాడు పంచాయతీ వార్డుకు ముగ్గురు పోటీలో నిలిచారు. ఈఎన్నికలలో మొత్తం 3236 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం పది పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు 9 మంది రిటర్నింగ్ అధికారులను, 9 మంది పోలింగ్ అధికారులను, మరో 31 మంది సహాయ పోలింగ్ అధికారులను నియమించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్ తెలిపారు.

విభేదాలు సద్దుమణిగేనా?

లోకేష్ పాదయాత్ర చేపట్టారు. అయితే గుడివాడ, పెడన అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎంఎల్‌ఎ రావి వెంకటేశ్వరరావు ఆ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సాగిస్తున్నారు. సుదీర్ఘకాలం ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తనకే పార్టీ అధిష్టానం టికెట్ ఇస్తుందని ఆయన ఆశిస్తున్నారు. అయితే ఏడాది క్రితం టిడిపిలో చేరిన ఎన్‌ఆర్‌ఐ వెనిగండ్ల రాము కూడా నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ టికెట్‌ను ఆశిస్తున్నారు. గుడివాడ అసెంబ్లీ సీటు రాముకే ఇస్తామని అధిష్టానం చెప్పినట్లు ఆయన అనుయాయులు చెబుతున్నారు. టిడిపి పెడన నియోజకవర్గ ఇన్చార్జిగా కాగిత కృష్ణప్రసాద్ పార్టీ కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే మాజీ ఎంఎల్‌ఎ బూరగడ్డ వేదవ్యాస్ పెడన అసెంబ్లీ టిక్కెట్ అధిష్టానం తనకే ఇవ్వనుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఇద్దరూ వేర్వేరుగానే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గన్నవరంలో నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు మృతి చెందిన తర్వాత టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణకే ఆ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. తాజాగా గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ దాసరి బాలవర్ధనరావు చంద్రబాబును కలిశారు. గత ఎన్నికల్లో గన్నవరం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలో చేరతానని ప్రకటించారు. చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోరడం, పార్టీ టికెట్ ఇస్తే గన్నవరం నుండి గెలిచి వస్తానని ప్రకటించడం చర్చనీయాంశమైంది. వీరిద్దరితోపాటు దేవినేని అపర్ణ, దేవినేని చంద్రశేఖర్ కూడా గన్నవరం టికెట్ ఆశిస్తున్నారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడలో పార్టీ పరిస్థితి గందరగోళంగా ఉంది. లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేసే బాధ్యతను విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని)ని కాదని ఆయన తమ్ముడు కేశినేని శివనాథ్ (చిన్ని)కి పార్టీ అధినాయకత్వం అప్పగించింది. ఎన్‌టిఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ముఖ్యంగా ఈ కార్యక్రమం జరిగే విజయవాడ సిటీలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి చిన్ని అనుయాయులే ప్రధానంగా రంగంలో ఉంటూ హడావుడి చేస్తున్నారు. కానీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) గ్రూపు మాత్రం సైలెంట్‌గా ఉండిపోయారు. అన్ని రకాలుగా తనను పార్టీ పూర్తిగా దూరం పెట్టిందని ఎప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎంపి నాని...లోకేష్ పాదయాత్రతో తనకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు కుటుంబంతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లినట్లు తెలిసింది. హరిద్వార్, ఇతర పలు పుణ్యక్షేత్రాల దర్శించడానికి వెళ్లినట్లు సమాచారం. కేశినేని బ్రదర్స్, ఆయా నియోజకవర్గాల ఇన్చార్జుల మధ్య నెలకొన్న వైర్యం ఎటువైపుకు దారి తీస్తుందోనని ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో మూడు గ్రూపులుగా టిడిపి నేతలు విడిపోయారు. ఎంపి కేశినేని నాని, ఆయన సోదరుడు కేశినేని చిన్ని, మాజీ ఎంఎల్‌ఎ జలీల్‌ఖాన్ గ్రూపులుగా నేతలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సెంట్రల్‌లోనూ పరిస్థితి గందరగోళంగా ఉంది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ బొండా ఉమా తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. అయితే సెంట్రల్ టికెట్‌ను వంగవీటి రాధా కూడా ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాధా కూడా లోకేష్ యాత్రకు సంబంధించిన కార్యకలాపాల్లో భాగస్వాములు కాలేదు. మరో ఏడెనిమిది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలో అంతర్గత విబేధాలను లోకేష్ ఏవిధంగా పరిష్కరిస్తారో చూడాలి.

వైసిపికి యార్లగడ్డ గుడ్‌బై

భవితవ్యంపై మీడియాతో మాట్లాడారు. "సీఎం జగన్...మీకిదే చెబుతున్నా...ఇంటిలిజెన్స్ రిపోర్టు ఉంటే తెప్పించుకుని పరిశీలించుకోండి...ఇప్పటి వరకు నేను చంద్రబాబు, లోకేష్‌తో సహా టిడిపి నేతలెవరినీ కలవలేదు. ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంటే నేనేమీ చేయలేను" అని వ్యాఖ్యానించారు. చంద్రబాబునుగానీ, లోకేష్‌నుగానీ తాను కలిసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుండి పూర్తిగా వైదొలుగుతా" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు బహిరంగంగా చెబుతున్నా..."గన్నవరం నియోజకవర్గంలో నన్ను నమ్మిన కార్యకర్తల కోసం, నాయకుల కోసం, జనం కోసం, వారి ఆశయాలను నెరవేర్చడం కోసం గన్నవరం నుంచి పోటీ చేస్తా, చంద్రబాబు అపాయింట్‌మెంట్ బహిరంగంగా కోరుతున్నా, ఆయన అనుమతి ఇస్తే ఆ పార్టీ తరపున బరిలోకి దిగుతా, వచ్చే ఎన్నికల్లో పులివెందుల నుంచి జగన్ గెలుపొంది అసెంబ్లీకి వస్తారు, గన్నవరం నుంచి నేనూ ఎంఎల్‌ఎగా గెలిచి అసెంబ్లీ సాక్షిగా ఆయనకు ఎదురుపడతా...ఇదే నేను సీఎం జగన్‌కు చెప్పే చివరి మాట" అని యార్లగడ్డ ఉద్వేగంగా అన్నారు. వైసిపిలో తగిన గుర్తింపు ఇవ్వకపోయినా ఏనాడూ తనకు కన్నీరు రాలేదని, ఇప్పుడు కార్యకర్తలు తనకు జరిగిన అన్యాయంపై కన్నీరు పెడుతుంటే చూసి గుండె తరుక్కుపోతోందని కళ్లు చెమర్చారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన తన లాంటి వాడిని..."ఉంటే ఉండూ, పోతేపో" అని సజ్జల వంటి నేత వ్యాఖ్యానించడం చాలా బాధ కలిగించిందన్నారు. సిఎం జగన్‌పై తనకు ఏ విధమైన కోపమూ లేదని, రాజకీయంగా తనకు చేసిన అన్యాయానికి వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుంచి పోటీ చేసి గెలవడం ద్వారా సరైన సమాధానం చెప్తానని స్పష్టం చేశారు. తొలుత తన అనుయాయులతో 3 గంటలపైగా సమాలోచనలు చేశారు. ఆయనతోపాటు సుమారు 370 మంది వరకు వైసిపికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో కోటగిరి వరప్రసాదరావు, కొల్లా ఆనంద్, తుల్లిమిల్లి ఝాన్సీ లక్ష్మి, బడుగు ఝాన్సీ పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఈనెల 22న గన్నవరంలో జరిగే లోకేష్ బహిరంగ సభలో యార్లగడ్డ టిడిపిలో చేరతారనే వార్తలు వస్తున్నాయి.

నేడు ఉమ్మడి కృష్ణాజిల్లాలోకి లోకేష్ పాదయాత్ర

ఘన స్వాగతం చెప్పడానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. లోకేష్ ముందుగా గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పంచాయతీ పరిధిలోని సీతానగరం నుంచి బయలుదేరి ప్రకాశం బ్యారేజికి చేరుకుంటారు. అక్కడ నుంచి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 37వ డివిజన్ వినాయకుని గుడి సెంటర్‌కు సాయంత్రం 4.45 గంటలకు వస్తారు. అక్కడ వ్యాపారులతో మాట్లాడతారు. 4.55 గంటలకు 54వ డివిజన్ కాళేశ్వరరావు మార్కెట్, 5.05 గంటలకు 55వ డివిజన్‌లోని విజయవాడ రైల్వేస్టేషన్, 5.15 గంటలకు 23వ డివిజన్‌లోని పోలీసు కంట్రోల్ రూమ్, 5.30 గంటలకు ఇదే డివిజన్‌లోని స్వర్ణప్యాలెస్, 5.45 గంటలకు బీసెంట్ రోడ్డు, 6 గంటలకు 25వ డివిజన్‌లోని విజయాటాకీస్ సెంటర్, 6.10 గంటలకు ఇదే డివిజన్ పరిధిలోని కొత్తవంతెన సెంటర్, 6.20 గంటలకు 24వ డివిజన్ పరిధిలోని సీతారామ్‌పురం జంక్షన్, 6.30 గంటలకు 26వ డివిజన్‌లోని చుట్టుగుంట సెంటర్ (బిఎస్‌ఎన్‌ఎల్) , 6.35 గంటలకు 6వ డివిజన్ పరిధిలోని విశాలాంధ్రరోడ్డు, 6.50 గంటలకు ఇదే డివిజన్‌లోని మెట్రో మార్ట్ సెంటర్ మీదుగా పాదయాత్ర చేస్తారు. రాత్రి 9.05 గంటలకు 19వ డివిజన్‌లోని ఎ కన్వెన్షన్ సెంటర్ క్యాంప్‌సైట్‌లో లోకేష్ బస చేస్తారు. 20, 21 తేదీల్లో తూర్పు, పెనమలూరు నియోజకవర్గాలో పర్యటిస్తారు. 22న గన్నవరంలో జరిగే బహిరంగ సభలో ఉమ్మడి జిల్లాలో యాత్ర ముగుస్తుంది.

సమాజమార్పు మహిళలతోనే సాధ్యం : కలెక్టర్



వంటలు రుచి చూస్తున్న కలెక్టర్, జేసీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సమాజంలో మార్పు రావాలంటే మహిళలకే సాధ్యమవుతుందని, ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టించకుండా వారి కుటుంబ అవసరాలకే వినియోగించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్లో గల మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ భవనంలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యంతో పలు మండలాల నుంచి వచ్చిన మహిళలకు వివిధ రకాల వంటకాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు విశిష్ఠ అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యంలో విటమిన్ బి12, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు సమ్మిళితమై ఉంటాయన్నారు. ఆ బియ్యాన్ని సామర్థ్యం తెలియక తక్కువ ధరకు ఇతరులకు అమ్మితే మీకు రావలసిన ప్రయోజనం వేరే వారి చేతికి పోయినట్లేనని భావించాలన్నారు. అంతకుముందు సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ మహిళల వంటల పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన మహిళలకు వరుసగా 10వేలు , 7వేలు , 4వేల రూపాయల నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను కూడా జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ పార్వతి, డి ఆర్ డి ఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వివిధ మండలాల నుంచి వచ్చిన పలువురు మహిళలు పాల్గొన్నారు.



కోమరవోలు లక్ష్మణరావును సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

సీనియర్ పాత్రికేయుడికి సన్మానం

ప్రజాశక్తి-గుడివాడ :ఎపియుడబ్ల్యూజె 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను గుడివాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ పాత్రికేయులు ఆంధ్రజోతి విలేకరి కోమరవోలు లక్ష్మణరావును పెద్దకాలువ సెంటర్‌లోని అయన స్వగృహంలో దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసారు. తొలుత యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు.

విద్యకు అధిక ప్రాధాన్యత : సర్పంచ్

ప్రజాశక్తి-పెదపారుపూడి : విద్య ద్వారా అభివద్ధి జరుగుతుందని వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని రావులపాడు గ్రామ సర్పంచ్ గోళ్ళ సోమేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా, అమ్మఒడి, రైతుభరోసా తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ పేదలను ఆదుకుంటోందన్నారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ గడపగడప కార్యక్రమం ద్వారా పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధానిస్తున్నారన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని సర్పంచ్ అన్నారు

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామీణ ప్రాంతాల అభివద్ధికి మండల పరిషత్ ద్వారా పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ప్రభుత్వ శాఖల వారిగా సమీక్ష జరిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ... గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివద్ధితో పాటు జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల అభివద్ధికి ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలో రెండవ విడతలో మరో 3,500 మందికి ఇళ్ల స్థలాలు పంపిణికి సన్నహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న గ్రామాల్లో రెండు, మూడు నెలల్లో నివేశన స్థలాలు పంపిణీకి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మిగిలిన గ్రామాల్లో ఇళ్ళ స్థలాలు కోసం భూసమీకరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ, గౌసాని, వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీఓ సత్యకుమార్, పలు శాఖల అధికారులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనగాని రవి

ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎన్జీవో నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 21వ తేదీ నుండి 22 వరకు జరగబోయే ఏపీ ఎన్జీవోస్ 21వ రాష్ట్ర మహాసభలకు రావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును ఎన్జీవో నాయకులు ఎన్జీవో నాయకులు ఆహ్వానిస్తూ శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం ఉపకసాన కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగస్తులందరినీ ఈ మహాసభలకు హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి రాజేంద్ర కుమార్, దివి యూనిట్ ఎన్జీవో యూనిట్ ప్రెసిడెంట్ ఎస్ సురేష్, అసోసియేట్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, ఈసీ మెంబర్ అమరావతి మస్తాన్ హరిబాబు పాల్గొన్నారు.

మినిమం టైమ్ స్కేల్ ఎంప్లాయీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ : మినిమం టైమ్ స్కేల్/ ఎన్.ఎం.ఆర్/ ఫుల్ టైం -పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్ విధులు నిర్వహిస్తున్న వారి సర్వీస్‌లను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మినిమం టైమ్ ఎంప్లాయిస్ (జెఎసి) యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో శుక్రవారం విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) కె మోహన్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. 'ముఖ్యమంత్రి మాకు న్యాయం చేయాలని, సర్వీస్ సీనియారిటీని ప్రామాణికంగా చేపట్టి మా సర్వీసులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మినమం టైమ్‌స్కేల్ ఎంప్లాయిస్ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మినమం టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ (జెఎసి) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బి సుబ్బారావు మాట్లాడుతూ... మినిమంటైమ్‌స్కేల్ ఎంప్లాయిస్‌ను వెంటనే రెగ్యులర్‌చేయాలని, లేనట్లయితే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాలలో 1993 నవంబర్ 25కు ముందు నియమింపబడి ఎన్.ఎం.ఆర్/ మినిమం టైమ్ స్కేల్/ ఫుల్ టైం- పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్‌గా విధులు నిర్వహిస్తున్న వారి సర్వీస్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలనిడిమాండ్ చేశారు. 1988 నుండి 1993మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వ వివిధ భాగాలలో ఎన్ ఎం ఆర్ /మినిమం టైం స్కేల్ /ఫుల్ టైం -పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్ గా పనిచేస్తున్న వారికి పది సంవత్సరాలు సర్వీస్ సీనియార్టీ కలిగి ఉందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ సీనియార్టీ కలిగిన వారిని పర్మినెంట్ చేయకుండా, ఆ తరువాత ఉద్యోగంలో చేరిన వారిని పర్మినెంట్ చేయడం సోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాలలో సుమారు 3000 మంది ఎన్ ఎం ఆర్ /మినిమం టైం స్కేల్ గా పని చేస్తున్న వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు, అన్యాయం నకు గురిఅవు తున్నాయని అన్నారు. ఇప్పటికే మా ఎంప్లాయిస్ వివిధ విభాగాలలో గత 30 సంవత్సరాలు నుండి విధులు నిర్వహించి రిటైర్మెంట్ దశకు చేరడం, వివిధ అనారోగ్య కారణాల వలన మరణించడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైరైన లేక అనారోగ్యంతో మరణించిన కుటుంబాల కు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేక ఆ కుటుంబాలు కడుదుర్భర పరిస్థితులను ఎదుర్కొం టున్నాయని అన్నారు. .2019 ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా తమ సర్వీసులను క్రమబద్ధీకరించడం జరుగుతుందని ఇచ్చిన హామీని విస్మరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి ఎస్ రఘునాథ్, రాష్ట్ర జేఏసీ సభ్యులు రంగారావు, రాజారావు, పరశురాములు ,భలే ప్రసాద్ ,కె సి ఎస్ ఎన్ వర్మ ,ఆనంద్, కే ఏసోబు, ఆర్ కోటేశ్వర ప్రసాద్, శివాజీవరప్రసాద్ ,లక్ష్మీ కామేశ్వరి, సత్యానందం, సాంబయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మినిమం టైమ్‌స్కేల్, ఎన్ఎంఆర్‌లు

గ్రామీణ ప్రాంతాలకు లయన్స్ క్లబ్ సేవలు

ప్రజాశక్తి -ఉయ్యూరు : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో పాటు రైతాంగానికి సేంలందించాలన్నది లయ న్స్ క్లబ్ లక్ష్యమని క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ గద్దె శేషగిరిరావు అన్నారు. కడవకొల్లులో వడ్డే బసవ రాజ్యం కమ్యూనిటీ హాల్లో శుక్రవారం ఉయ్యూరు క్లబ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలకు రూ. 10వేలు విలువచేసే దోమల మందు ఉచితంగా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో పాటు రైతులకు ఉపయోగపడే విధంగా లయన్ల క్లబ్ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. గ్రామల్లో దోమలు ఉత్పత్తి పెరగకుండా నివారించేందుకు ఉచితంగా దోమల మందు అందజేసి ప్రజలు దోమకాటుకు గురికాకుండా తోచిన విధంగా పంచాయతీలకు సహాయం చేస్తున్నామన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, దండమూడి గణేశ్, డాక్టర్ రావులపల్లి సుధాకర్, వీరయ్య చౌదరి, ఎస్ఎం ఎల్ జీఎం శ్రీనివాసరావు, మధురవాణి, కుందేరు సర్పంచ్ కలకోటి రాధిక, రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు గద్దర్ సంస్మరణ సభ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : పీడత ప్రజల గొంతుక ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ ఈనెల 20న మచిలీపట్నంలో జరుగుతుందని దళిత జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక గాడెల్లి కళ్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో దళిత జేఏసీ నాయకులు కార్యక్రమ వివరాలు తెలిపారు. ఈ మేరకు తొలుత కరపత్ర ఆవిష్కరణ చేసిన నాయకులు జిల్లా స్థాయి లో గద్దర్ సంస్కరణ సభ మచిలీపట్నంలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్) ప్రొఫెసర్ సి. కాశీం హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత జేఏసీ అధ్యక్షులు జక్కుల ఆనందబాబు, గాడెల్లి డేవిడ్ శామ్యూల్, బందెల థామస్ నోబుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజీ గూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ కు 2000-2001 పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఒక కంప్యూటర్ బహుకరించారు.ఈ సందర్భముగా పాఠశాల హెచ్‌ఎం.రజని కుమారి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కృష్ణాపురంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఆంధ్రప్రదేశ్లో వైద్యరంగం విద్యా రంగం రెండు కళ్ళు వంటివి అని, అవి ప్రతిఒక్కరికీ అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పనిచేసోతందని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని కష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఏను వెంకటరమణకుమారి, సచివాలయం కన్వీనర్ పరస జగన్, మండల ఉపాధ్యక్షుడు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి, వైయస్సార్ పార్టీ నాయకులు సొంటి వెంకటేశ్వరావు, నారపాక మహేష్‌రావు , మైనేని కోటేశ్వరరావు, వీరంకి చిరంజీవి, పెనుమోత్స రమేష్, కొడాలి రాంబాబు , దిమ్మెట రాంబాబు, ఆరోగ్య సిబ్బంది బుజ్జి బాబు, స్థానిక ఎఎన్ఎం సుమలత పాల్గొన్నారు.

రేషన్ బియ్యంతో పలు రకాల వంటలు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న నాణ్యమైన రేషన్ బియ్యంతో మహిళలు నోరూరించే ఆరోగ్యవంతమైన 75 రకాల పిండి వంటకాలను తయారు చేయడం అభినందనీయమని పౌర సరఫరాల కమిషనర్ సిహెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ గ్రామీణాభివృద్ధి సంస్థ రేషన్ దుకాణాల మహిళలు రేషన్ బియ్యంతో తయారు చేసిన వంటకాలను పౌరసరఫరాల శాఖ కమీషనర్ సిహెచ్.అరుణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సందర్శించి వంటకాలను రుచిచూసి మహిళలను అభినందించారు. అనంతరం కమిషనర్ సిహెచ్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన రేషన్ బియ్యాన్ని వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1కోటి 46లక్షల మంది కార్డు దారులకు 2లక్ష 35వేల మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యాన్ని కార్డు దారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. మొదటి వారంలోనే దాదాపు 70 నుండి 80 శాతం మంది కార్డుదారులు రేషన్ దుకాణాలు మొబైల్ వాహనాల ద్వారా బియ్యాన్ని పొందుతున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాలు, అంగన్‌వాడీలు, రేషన్ దుకాణాలకు చెందిన మహిళలు రేషన్ బియ్యంతో ప్రత్యక్షంగా జార్డా రైస్, ఇడియప్పం, ఆరెసలు, పాలతాలికలు, డ్రైఫ్రూట్స్, పూర్ణాలు, చక్రాలు, చెక్కలు, ఉండ్రాళ్లు, కట్ పొంగలి, వెజ్ బిరియానీ, కుడుములు, కారంపూస వంటి రుచికరమైన పిండి వంటలను తయారు చేసి ప్రదర్శించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ వెంకటేశ్వర్లు జిల్లా సరఫరాల అధికారి మోహన్‌బాబు, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి. ఉమాదేవి, మార్క్‌ఫెడ్ డియం నాగమల్లిక, లిగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఏ. కృష్ణ చైతన్య, రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం.వెంకట్రరావు, మహిళలు పాల్గొన్నారు.


వంటలను రుచిచూస్తున్న పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్, పక్కన కలెక్టర్ డిల్లీరావు

విదేశీ విద్య పట్ల విద్యార్థుల ఆసక్తి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ సరైన మార్గదర్శకం చేసి, మంచి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, వసతి, స్కాలర్షిప్లు పొందేలా తోడ్పాటును అందిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్ హిమబిందు తెలిపారు. తమ సంస్థ ద్వారా అనేక మంది విద్యార్థులను విదేశీ విద్యకు వివిధ దేశాలకు పంపించడం జరిగిందని ఆమె వెల్లడించారు. విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొంది, అక్కడ విద్యను అభ్యసించేందుకు అవసరమైన అన్ని సేవలను అందజేస్తామని తెలిపారు. మహాత్మా గాంధీ రోడ్‌లోని ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ కార్యాలయంలో అమెరికా, కెనడా యూనివర్సిటీస్ ఫెయిర్ నిర్వహించారు. అమెరికా, కెనడాకు చెందిన 35 విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫెయిర్ లో పాల్గొని అమెరికా, కెనడాలో ఉన్న విశ్వవిద్యాలయాలు, అక్కడ అందిస్తున్న కోర్సులు, ఫీజులు, స్కాలర్షిప్ ల వివరాలు, వీసా, వసతి సౌకర్యాలు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సౌత్ అసోసియేట్ డైరెక్టర్ హిమబిందు మాట్లాడుతూ అమెరికా , కెనడా ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో స్టూడెంట్స్‌కి ఉన్నత విద్య అవకాశాలు, స్కాలర్ షిప్స్, కెరీర్ అవకాశాలు, స్టెమ్ ప్రోగ్రామ్స్ తెలపడం జరిగిందన్నారు. 35 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఫెయిర్ లో పాల్గొన్నాయన్నారు. కొన్ని అప్లికేషన్స్ ప్రాసెస్ చేశారన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే వారి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. సంస్థ విజయవాడ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు విశ్వవిద్యాలయాలు, అక్కడ అందిస్తున్న కోర్స్ ల గురించి ఏమైనా సందేహాలు ఉంటె వారికి నివత్తి చేశామన్నారు. ఫెయిర్ కి రాలేకపోయిన వారికి వర్చువల్ గా యూనివర్సిటీస్ విసిట్ చేసి తెలుసుకున్నారని అన్నారు.


విదేశీ విద్యపై విద్యార్థులకు వివరాలు చెబుతున్న నిర్వాహకులు

రిక్షా స్టాండ్ తొలగించొద్దని సిఐటియు నిరసన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్తపేట కేబీఎన్ కాలేజ్ బయట ప్రభుత్వ స్థలంలో ఉన్న రిక్షా స్టాండ్‌ను తొలగించ వద్దని, ఈ స్థలంలో కేబీఎన్ కాలేజీ యాజమాన్యం చేపడుతున్న గ్రీనరీ ఏర్పాటు పనులను శాశ్వతంగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో కేబీఎన్ కాలేజ్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఇ.వీ. నారాయణ, నాయకులు కే. సూరిబాబు పాల్గొని మాట్లాడుతూ గత 50 ఏళ్ల నుంచి రిక్షా కార్మికులు ఈ ప్రభుత్వ స్థలంలో తమ రిక్షాలను నిలుపుకుంటున్నారని అన్నారు. వీరంతా కొండ పై ప్రాంతంలో నివాసముండే పేదలని అన్నారు. వీరికి వేరే చోట స్థలం లేదని చెప్పారు. వీళ్ళు పగలంతా స్కూల్ పిల్లలను తమ రిక్షా, ఆటోలలో తీసుకెళ్ళి, మిగిలిన సమయంలో చిన్న,చిన్న కిరాయులు తోలుతు అతితక్కువ ఆదాయంతో జీవిస్తున్నారని తెలిపారు. పని అయిపోయాక రిక్షా, ఆటోలను స్టాండులో నిలుపుదల చేసుకుని కొండ పైన వాళ్ళ ఇళ్లకు చేరుకుంటాలని చెప్పారు. ఈ స్థలంలో కేబీఎన్ కాలేజ్ యాజమాన్యం గ్రీనరి ఏర్పాటుకు చర్యలు చేపట్టడం సమంజసం కాదన్నారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందని, కాలేజీ యాజమాన్య సొంత స్థలం కాదన్నారు. ఈ స్టాండులో గ్రీనరి ఏర్పాటు ఆపాలని మునిసిపల్ అధికారులను కోరామని చెప్పారు. గ్రీనరీ పనులు మానుకోవాలని లేని పక్షంలో పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, నూకరాజు అప్పన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ రైల్వేస్టేషన్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని వారు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా సిఐటియు పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చౌక్‌లో ధర్నా జరిగింది. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగిపనిలోకి తీసుకోవాలని, తొలగించిన రక్షక్, పద్మావతి కాంట్రాక్ట్ సంస్థలపై రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని కోరుతూ నాయకులు, కార్మికులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ... విజయవాడ రైల్వేస్టేషన్‌లో గత 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దారుణమని, వెంటనే వారిని పనిలోకి తీసుకోవాలని, లేనట్లయితే కార్మికుల తరుపున సిఐటియు అండగా నిలిచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. రైల్వే స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికులు ప్లాట్‌ఫామ్‌లు, ట్రాక్‌లు, ఆఫీసులు శుభ్రం చేయడం, రైళ్ల బోగీలకు నీళ్లు పెట్టడం లాంటి పనులు చేస్తుంటారని అన్నారు. వీరు చేస్తున్న పని వల్లనే విజయవాడ రైల్వేస్టేషన్‌కు రెండు సార్లు ఉత్తమ పరిశుభ్రత అవార్డులు వచ్చాయని అన్నారు. తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదని నెల రోజుల నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. తక్షణమే కార్మికులను పనిలోకి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్‌జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, పశ్చిమ సిటీ అధ్యక్షులు ఇవి నారాయణ, సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె దుర్గారావు, ఎంవి సుధాకర్, నాయకులు ఎం బాబూరావు, వై సుబ్బారావు, ఎం సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

అమెజాన్ కార్యకలాపాల్లో రాజ్‌దీప్ ఎంపిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సైనిక అనుభవజ్ఞుల కోసం దృఢమైన నిర్మాణం, అంకితమైన కార్యక్రమాలను అమెజాన్ నిర్వహిస్తుందని, ఇందులో భాగంగానే రాజ్‌దీప్‌ను అమెజాన్ సంస్థలో ఆహ్వానిస్తుందని సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెజాన్ సేవలను విస్తృతం చేయాలనే ఉద్దేశంతో రాజ్‌దీప్‌ను తమ సంస్థలో ప్రోగ్రామ్ మేనేజర్‌గా తీసుకున్నట్లు తెలిపారు.

రక్తపోటుపై డాక్టర్ రెడ్డీస్ అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఔషద సంస్థ డాక్టర్ రెడ్డీస్ రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎం.ఎస్.రావు తెలిపారు. హైపర్‌టెన్షన్ దాని లక్షణాలు, కారణాల గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవితం కోసం రక్తపోటును సమర్థవంతంగా ఎలా ఉండాలో తెలియచేస్తున్నామని తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా క్రికెటర్ సునీల్ గవాస్కర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికచేశామని తెలిపారు.


కిచెన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎం.రాజయ్య

ఇమేజ్ హోమ్ అండ్ కిచెన్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హోమ్ అండ్ కిచెన్ అప్లయెన్సెస్‌లో 25 సంవత్సరాల అనుభవం గల ఇమేజ్ మార్కెటింగ్ ఏజెన్సీ విజయవాడలో అతిపెద్ద షో రూమ్ ఏర్పాటు చేయడం గర్వకారణమని గేట్ వే హోటల్ చైర్మన్ ఎం.రాజయ్య అన్నారు. ఎం.జి రోడ్‌లో నూతనంగా నిర్మించిన షోరూమ్‌ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ఇమేజ్ షోరూమ్ క్వాలిటీ ప్రొడక్ట్స్ ఇస్తూ వినియోగదారులకు మంచి షాపింగ్ అనుభవం ఇస్తుందని చెప్పారు. అమరావతి రాజధానిలో ఈ షోరూమ్ ఎంతో అభివద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. క్రామ్ టామ్ సంస్థ రీజనల్ మేనేజర్ వేదాంతం శ్రీధర్, ఫేబర్ కంపెనీ ప్రతినిధి రామ్ ప్రసాద్, ఇమేజ్ మార్కెటింగ్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీహరి, ఒకి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద షోరూమ్‌ను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. కిచెన్ అప్లయెన్సెస్‌లో ఇమేజ్ సంస్థ 25 సంవత్సరాల అనుభవం ఉందని పేర్కొన్నారు. క్వాలిటీ ప్రొడక్ట్స్ ఇస్తూ వినియోగదారులకు మంచి షాపింగ్ అనుభవం ఇస్తుందని చెప్పారు.

ఎన్ని ఆటంకాలు ఎదురైనా లోకేష్ పాదయాత్ర ఆగదు

టిడిపి సీనియర్ నాయకులు కేశినేని చిన్ని

ప్రజాశక్తి-విజయవాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు విజయవాడలో అధికార వైసిపి ప్రభుత్వం అధికారులపై వత్తిడి తీసుకొచ్చి అడుగడుగునా ఆటంకం సృష్టిస్తుందని, ఇటువంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇబ్బందులు ఎదురయినా లోకేష్ పాదయాత్ర విజయవంతం అవుతుందని అన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో యువగళం పాద యాత్ర జరుగుతుందని అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో పాదయాత్ర జరుగుతుందని అయితే నగరంలో నారా లోకేష్ బాబు అడుగు పెట్టకూడదని రెండు రోజుల క్రితం స్థల యజమానులను బెదిరించి విడిది ప్రాంతాలు ఇవ్వనీయకుండా స్థల యజమానులను వైసిపి నాయకులు భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు.


ఎమ్మెల్యే భాస్కరరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఇఒ

దుర్గమ్మను దర్శించుకున్న ఎంఎల్ఎ భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర శాసన సభ్యులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శుక్రవారం శ్రీ అమ్మవారి దర్శనా ర్థం ఆలయానికి విచ్చేశారు. శ్రీ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వీరికి ఆలయ కార్యని ర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ స్వాగ తం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఇఓ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దుర్గగుడికి భక్తుల రద్దీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాల యానికి శ్రావణ (మొదటి) శుక్రవారం సందర్భం గా భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. అమ్మవారి దర్శనార్ధం విశేషంగా విచ్చేసిన యాత్రికుల రద్దీ దష్ట్యా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ టస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఏర్పాట్లను చేశారు.

అన్నదానానికి రూ. 2 లక్షలు విరాళం

దుర్గమ్మ ఆలయంలో ప్రతిరోజూ జరిగే నిత్యాన్నదాన పథకానికి వెస్ట్‌కోస్ట్ రోడ్, సింగపూర్‌కు చెందిన శ్రీనివాస్ బొబ్బ కుటుంబ సభ్యులు రూ.2 లక్షలను బొబ్బ వెంకటేశ్వరరావు చౌదరి వారి పేరున విరాళం అందజేశారు.